క్లుప్తంగా

మునగాల తహసీల్దార్‌గా రామకృష్ణారెడ్డి



రామకృష్ణారెడ్డి

మునగాల : మండల నూతన తహసీల్దార్‌గా బి.రామకృష్ణారెడ్డి శుక్ర వారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన వి.ఆంజనేయులు భువనగిరికి బదిలీ కాగా ఆయన స్థానంలో కోదాడ ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా విధులు నిర్వర్తిస్తున్న రామకృష్ణారెడ్డి బదిలీపై మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానన్నారు. ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో మండలాభివృద్ధికి పాటుపడతానన్నారు.

మేళ్లచెరువు తహసీల్దార్‌గా నూకల రాజేందర్‌రెడ్డి

మేళ్లచెరువు : మండల తహసీల్దార్‌గా నూకల రాజేందర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన జ్యోతి యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూర్ మండల తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లడంతో హుజూర్‌నగర్ ఆర్డీఓ కార్యాలయంలో డివిజినల్ అడ్మిన్‌స్ట్రేటివ్ అధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషిచేస్తానన్నారు.

చింతలపాలెం ఎస్‌ఐగా సందీప్‌రెడ్డి



సందీప్‌రెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండల నూతన ఎస్‌ఐగా ఎన్.సందీప్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ అంతిరెడ్డి రేషన్ బియ్యం కేసులో స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ.10వేలు లంచం తీసుకుంటూ గత నెల 8న ఏసీబీ అధికారులకు పట్టుబడడంతో అక్కడ పోస్టు ఖాళీగా అయింది. దీంతో నల్లగొండ 1టౌన్ ఎస్‌ఐగా పనిచేస్తున్న సందీప్‌రెడ్డిని చింతలపాలెం బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురం గ్రామంలో ఆయా వీధుల్లో 8నెలలుగా వీధిదీపాలు వెలగడం లేదని గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. వేసవికాలం దృష్ట్యా దొంగల బెడద ఉండడంతో గ్రామస్తులు చీకట్లో ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.

రేపు కోలాట పోటీలు

మునగాల : మండలంలోని నేలమర్రిలో గ్రామ కళాకారుల ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల స్థాయిలో కోలాట పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బచ్చలకూర రాంబాబు శుక్రవారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొని విజేతలైన వారికి ప్రథమ బహుమతి రూ.15,016, ద్వితీయ బహుమతి రూ.12,016, తృతీయ బహుమతి రూ.10,016ల అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల కోలాట కళాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని కోరారు. వివరాలకు 99597 78138ను సంప్రదించాలన్నారు. ఈ పోటీలను ఆదివారం మునగాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.రామకృష్ణారెడ్డి ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

వర్షపు నీరు వెళ్లేందుకు గూనలు ఏర్పాటు



గూనలు ఏర్పాటు చేయిస్తున్న కోతి సంపత్‌రెడ్డి

హుజూర్‌నగర్ : పట్టణంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున 3వ వార్డు పరిధిలోని గణేష్‌నగర్ కాలనీలో ఖాళీ స్థలాల్లో వర్షపు నీలిచింది. దీంతో అసౌకర్యానికి గురైన స్థానికులు ఈ విషయాన్ని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డికి తెలియజేశారు. వెంటనే స్పందించిన ఆయన శుక్రవారం వర్షపు నీరు వెళ్లేందుకు వీలుగా రోడ్డును తవ్వించి సిమెంట్ గూనలు వేయించారు. దీంతో ఆకాలనీవాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి

హుజూర్‌నగర్ : లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి కోరారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, కనకరత్నం, వెంకటేశ్వర్లు, రామయ్య, దుర్గారావు, సైదులు, స్వరూప సుకన్య వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి సర్వీస్ రోడ్డుతో అవస్థలు

- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



మునగాల మసీద్ వద్ద అసంపూర్తిగా నిలిచిన సర్వీసురోడ్డు నిర్మాణ పనులు

మునగాల: అసంపూర్తి సర్వీస్ రహదారితో మండల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారిని నాలుగులేన్లుగా విస్తరించిన అనంతరం మండల కేంద్రంలో జీఎమ్మార్ సంస్థ చేపట్టిన సర్వీసు రోడ్ల నిర్మాణం పూర్తిచేయకపోవడంతో నిత్యం వివిధ వర్గాల ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయడంతో రహదారికి ఇరువైపులా దాదాపు 2కిమీ పొడవున సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. సర్వీసు రోడ్ల నిర్మాణం చేపట్టి ఏళ్లు గడుస్తున్నా స్థానిక మజీద్ వద్ద సుమారు 300మీటర్ల మేర సర్వీసు రోడ్డు నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. దీంతో మండలంలోని నారాయణగూడెం, కృష్ణానగర్ గ్రామాల ప్రజలతో పాటు ఈ ప్రాంతం ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ ప్రాంతంలో ముస్లిం, మైనార్టీ వర్గాలకు చెందిన ఖబ్రస్తాన్ ఉండడంతో ఆ వర్గాల వారు ఈ ప్రాంతంలో సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఇష్టపడకపోవడంతో పనులు నిలిచాయి. దీంతో జీఎమ్మార్ సంస్థ దీనిని సాకుగా తీసుకోవడంతో సర్వీసు రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. స్థానికులు పలుమార్లు ఈ ప్రాంతంలో సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తిచేయాలని మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి అధికారుల వరకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం కన్పించలేదు. జాతీయ రహదారి పూర్తయి ఏళ్లు కావస్తున్నా సర్వీసు రోడ్లు నిర్మాణం చేపట్టకపోవడంతో పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిపై వాహనాలు నడిపేవారి నుంచి టోల్‌గేట్ వసూలు చేస్తున్న హైవే కాంట్రాక్టర్లు సర్వీసు రోడ్ల నిర్మాణం పూర్తిచేయకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సర్వీసురోడ్డు నిర్మాణం చేపట్టాలి



మండల కేంద్రంలో మజీద్‌కు సంబంధించిన ఖబ్రస్తాన్ వద్ద గతంలో అసంపూర్తిగా నిలిచిన సర్వీసు రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలి. ఇప్పటికే పలుమార్లు అధికార యంత్రాంగం, జీఎమ్మార్ సంస్థ దృష్టికి తీసుకెళ్లాం. అసంపూర్తి రోడ్డుతో ప్రమాదాల బారిన పడుతున్నాం. సర్వీసు రోడ్డు నిర్మాణం చేయకుంటే ఆందోళన చేపడతాం.

– గద్దం లక్ష్మీనారాయణ, నారాయణగూడెం

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మునగాల : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్



గరిడేపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ ఎస్‌ఐ సురేష్‌రెడ్డి

మునగాల : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణలో భాగంగా శుక్రవారం ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న ఆర్థిక నేరాలకు సంబంధించినటువంటి సైబర్ క్రైమ్, విద్యార్థుల దురలవాట్లకు గురై డ్రగ్స్‌కు ఎడిక్ట్ అవుతున్న విషయాలను కూలంకషంగా వివరించారు. మండలంలోని పాఠశాలలో ఎక్కడైనా విద్యార్థులు గాని సమాజంలో ఇతరులు కాని ఎటువంటి డ్రగ్స్ వంటి దురలవాట్లకు బానిసలైతే వారిని గుర్తించి పోలీసు శాఖకు తెలియచేయాలని సూచించారు. మండలంలోని ఉపాధ్యాయులందరూ ఒక వాట్సాప్ గ్రూపును తయారుచేసి డ్రగ్స్ నుంచి విద్యార్థుల ఆరోగ్యం కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సైబర్ నేరగాళ్ల బారిన పడినప్పుడు సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఫోన్ నంబర్ 1930కి, ఇతర సమస్యలు ఎదురైతే 100కి డయిల్ చేయాలని కోరారు. సైబర్ నేరాలు పెరిగిపోతున్న తరుణంలో మండల ప్రజలు, ముఖ్యంగా యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

గరిడేపల్లి : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండే విధంగా ఉపాధ్యాయులను చైతన్యపర్చాలని ట్రైనీ ఎస్‌ఐ సురేష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. యువతను మాదకద్రవ్యాల బానిసత్వం నుంచి రక్షించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన కోరారు. విద్యార్థులు వాటి బారిన పడకుండా ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుర్తించాల్సిన అసాధారణ ప్రవర్తనలు, సమయానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి సమగ్రమైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాడువాయి పీఏసీఎస్‌లో ముగిసిన విచారణ



విచారణలో పాల్గొన్న విచారణాధికారి ఇందిర

మునగాల : మండలంలోని తాడువాయి ప్రాథమిక సహకార సంఘంలో జరిగిన అవినీతి, అక్రమాలకు సంబంధించి విచారణాధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వి.ఇందిర సొసైటీ కార్యాలయంలో మూడు రోజులుగా చేపట్టిన బహిరంగ విచారణ శుక్రవారంతో ముగిసింది. గతంలో సొసైటీకి సంబంధించిన పలువురు రైతులు తాము తీసుకున్న రుణాలను చెల్లించి రశీదులు పొందినప్పటికీ సొసైటీ ఖాతాలో జమచేయకుండా సిబ్బంది స్వాహా చేసినట్లు గతంలో జరిగిన విచారణలో తేలింది. దీంతో సొసైటీకి సంబంధించిన సీఈఓ, ఎస్‌ఏ, కంప్యూటర్ ఆపరేటర్లను జిల్లా అధికారులు సస్పెండ్ చేశారు. కాగా సొసైటీలో రుణాలు తీసుకొని చెల్లించిన రైతులు బహిరంగ విచారణకు హాజరుకావాలని విచారణాధికారి ఐదు రోజుల క్రితం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో కోరారు. విచారణ అధికారి మూడు రోజులుగా చేపట్టిన విచారణలో భాగంగా సొసైటీ పరిధిలోని నేలమర్రి గ్రామానికి చెందిన 13మంది, తాడువాయి గ్రామం నుంచి ఐదుగురు, నర్సింహులగూడెం, కలకోవ గ్రామాల నుంచి ఇద్దరు, మాధవరం నుంచి నలుగురు, రేపాల గ్రామం నుంచి ఒక రైతు ఈ విచారణలో పాల్గొని ఆధారాలతో సహా తాము చెల్లించిన రుణాల రశీదులను అందచేశారు. తాము సొసైటీలో రుణం చెల్లించినప్పటికీ సొసైటీలో సిబ్బంది జమచేయలేదని విచారణాధికారి ముందు తెలిపారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ సొసైటీ జూనియర్ ఇన్‌స్పెక్టర్ అంబేద్కర్, సొసైటీ ఇన్‌చార్జ్ సీఈఓ చందా ప్రవీణ్‌రెడ్డి, ఎస్‌ఏ పనస కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్రనామ కుంకుమార్చన



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి ఆలయంలో సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, మంగళాశాసనం, సహస్రనామ ఫల పుష్పార్చన, కుంకుమార్చనలు, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, శ్రీగోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామావళి, ఆలంకరణ, గోపూజ, అనంతరం ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఈఓ ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బెల్ట్ దుకాణాలను వెంటనే మూసివేయాలి



బెల్ట్ దుకాణాదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ

మునగాల : మండల పరిధిలోని జాతీయ రహదారి–65 పక్కన బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం హైవే వెంట మద్యం బెల్టు దుకాణాలను నిర్వహించే పలువురు దుకాణ యజమానులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. హైవే పక్కన మద్యం బెల్టు దుకాణాలు నిర్వహించడంతో పలువురు వాహనదారులు మద్యం సేవించి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. బెల్టు దుకాణాలలో మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి వారితో సంతకాలు తీసుకున్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యత మహిళలదే



నల్లచెరువు వద్ద మహిళా సంఘం సభ్యులతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

సూర్యాపేట అర్బన్ : చెరువుల ప్రాంతాలలో మొక్కలు నాటి వాటిని పరిరక్షించే పనులను ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించిందని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం అమృత్ 2.0లో భాగంగా పట్టణంలోని నల్ల చెరువు వద్ద ఉమెన్ ఫర్ ట్రీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెరువు వద్ద మొక్కలు నాటే ప్రాంతాన్ని మహిళా సంఘం సభ్యులకు చూపించి మార్కింగ్ చేశారు. అనంతరం పట్టణంలోని నర్సరీని సభ్యులతో సందర్శించారు. మొక్కలు ఎలా నాటాలి, ఎలా సంరక్షించాలి అనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ ఎం.కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, టీఈ రాజారెడ్డి, మెప్మా టీఎంసీ శ్వేత, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రెయినేజీలు



మునగాలలో ఓ మిల్లు ఎదుట చెత్తాచెదారంతో నిండిన డ్రెయినేజీ

మునగాల : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండల కేంద్రంతో పాటు బరాఖత్ గూడెం గ్రామాల పరిధిలో గతంలో జీఎమ్మార్ సంస్థ ఏర్పాటు చేసిన వీయూపీ బ్రిడ్జీలకు ఇరువైపులా సర్వీసు రోడ్లను నిర్మించింది. ఈ సర్వీసు రోడ్ల నిర్మాణంతో పాటు రోడ్డు వెంట డ్రెయినేజీలను ఏర్పాటు చేసి గ్రామాల్లోని మురుగుకాల్వలకు అనుసంధానం చేశారు. ఈ డ్రెయినేజీలు ఏర్పాటు చేసి సుమారు 12ఏళ్లు పూర్తి కావస్తుంది. కాని నాటి నుంచి నేటి వరకు ఈ డ్రెయినేజీలను శుభ్రం చేసిన పాపాన పోలేదు. ఫలితంగా సర్వీసురోడ్లపై ఉన్న చెత్త చెదారంతో పాటు, ప్లాస్టిక్ కవర్స్, ప్లాస్టిక్ బాటిల్స్ డ్రెయినేజీల్లో పేరుకుపోయి మురుగు నీరు పోకుండా అడ్డుపడుతున్నాయి. ఫలితంగా వర్షం వచ్చినప్పుడు మురుగునీరు సర్వీసు రోడ్లపైకి వచ్చి దుర్వాసన వెదజల్లుతుంది. అదే విధంగా రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అంతే కాకుండా ఈ డ్రెయినేజీలపై అక్కడక్కడ మూతలు కూడా లేకపోవడంతో పలువురు చెత్త చెదారం అందులో పడవేయడంతో మురుగు నీరు పోయే ఆస్కారం కనిపించడం లేదు. సర్వీసు రోడ్ల వెంట నిర్మించిన డ్రెయినేజీల నిర్వహణను పట్టించుకోకపోవడంతో రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రెండు గ్రామాలలో సర్వీసు రోడ్ల వెంట ఉన్న డ్రెయినేజీలను శుభ్రం చేసి మురుగునీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

కోదాడ : వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో విత్తనాల, ఎరువుల డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలని, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలుంటాయని కోదాడ ఆర్డీఓ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో వ్యవసాయ శాఖ, పోలీస్, రెవెన్యూ శాఖల సంయుక్త సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లైసెన్స్ కలిగిన డీలర్లు మాత్రమే విత్తనాలను విక్రయించాలని, అమ్మిన విత్తనాలకు సంబంధించి అన్ని వివరాలతో రైతులకు రశీదు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయశాఖ, పోలీస్‌శాఖలతో పాటు రెవెన్యూ అధికారులు కూడా విత్తనాల విక్రయంపై కన్నేసి ఉంచాలని, నకిలీలు అమ్ముతున్నట్లు ఏమాత్రం సమాచారం ఉన్నా క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో టౌన్ సీఐ శివశంకర్, రూరల్ ఏఎస్‌ఐ మల్లయ్య, కోదాడ తహసీల్దార్ వాజీద్, మండల వ్యవసాయ అధికారి రజనీ తదితరులు పాల్గొన్నారు.

పత్తేపురం వాసికి దళితరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న సైదులు

నేరేడుచర్ల : మండలంలోని పత్తేపురం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు ఆరే చిన్న సైదులుకు అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా దళితరత్న అవార్డు దక్కింది. ఈ అవార్డును శుక్రవారం సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ క్లాసిక్ గార్డెన్‌లో అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటక రాజు చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. అవార్డు రావడం చాలా గర్వంగా ఉందని, చాలా కాలంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కుల కోసం పోరాడుతున్న తన సేవలను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం ఈ అవార్డుకు ఎంపిక చేయడంతో పాటు సన్మానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనకు అవార్డుకు ఎంపిక చేయడం పట్ల ప్రత్యేకంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుక రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందన్నారు.

వేసవిలో నిండుకుండలా ఊరచెరువు



నీటితో కళకళలాడుతున్న మునగాల ఊరచెరువు

మునగాల : ప్రస్తుత వేసవిలో చెరువులు ఎండిపోయి కనిపించాల్సిన ఈ తరుణంలో మండల కేంద్రంలోని ఊరచెరువు నిండుకుండలా నీటితో కళకళలాడుతుంది. మునగాల శివారులో ఉన్న సాగర్ ఎడమకాల్వపై ఉన్న ఎల్–33ఎత్తిపోతల పథకం ద్వారా ఈ చెరువును సాగర్‌నీటితో నింపడంతో ప్రస్తుతం నీటితో నిండి ఉంది. దీంతో మండల కేంద్రంలో భూగర్భజలవనరులు పుష్కలంగా ఉండి వచ్చే రెండు మూడు నెలల వరకు తాగునీటికి ఢోకాలేదు. చెరువులో నీరు ఉండడంతో పశువులకు పుష్కలంగా తాగునీరు లభించే అవకాశం ఉంది.

వైద్యారోగ్యశాఖ అవినీతిపై విచారణ జరపాలి

కోదాడ : జిల్లా వైద్యారోగ్యశాఖ అవినీతిలో కూరుకుపోయిందని జిల్లా అధికారిని తొలగించడమే కాకుండా అతడి హయాంలో జరిగిన అవకతవకలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామీణ పేదల సంఘం, భారత విప్లవకారుల సమైక్య కేంద్రం కోదాడ డివిజన్ నాయకులు ఇటికాల శ్రీనివాసచారి, బాణోతు బాళోజీనాయక్ కోరారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా నకిలీ వైద్యులు అర్హత లేని డయాగ్నస్టిక్ సెంటర్లపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు ఆరోగ్యభద్రత కల్పించాలని కోరారు.

అనుమతులు లేని హాస్పిటల్స్‌పై చర్యలు తీసుకోవాలి

తాళ్లగడ్డ (సూర్యాపేట) : అనుమతులు, అర్హతలు లేకుండా సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్, స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మెడికల్ మాఫియాకు సహకరించిన డీఎంహెచ్ఓ కోటాచలంపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయంలో అన్నదానం

నడిగూడెం : మండలంలోని బృందావనపురంలో హనుమాన్ జయంతి సందర్భంగా శుక్రవారం దాసాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి, నడిగూడెం సహకార సంఘం మాజీ చైర్మన్ పుట్టా రమేష్, కోవూరు లింగారెడ్డి, కోవూరి నర్సిరెడ్డి, ఇందుర్తి లింగారెడ్డి, అనంతుల ఆంజనేయులు, కాసాని ఉపేందర్, పుట్టా సీతయ్య, మండవ అంతయ్య, పుట్ట చంద్రయ్య, హనుమయ్య, మహేష్, ప్రవీణ్, శ్రీను, భక్తులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగ విద్యార్థులకు అన్నదానం

మోతె : మండల కేంద్రానికి చెందిన కందిబండ దామోదర్‌రావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కందిబండ విద్యావతి, గోపి, లత శుక్రవారం కోదాడ పట్టణంలోని శనగల రాధాకృష్ణ స్వచ్ఛంద సేవా సంస్థకు చెందిన మానసిక వికలాంగుల అనాథ విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు మాట్లాడారు. మానసిక దివ్యాంగ అనాథ విద్యార్థులకు ఒక్కరోజు అన్నదానం చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం!



నడిగూడెంలో చెత్తాచెదారంతో నిండిపోయిన వాగు



బృందావనపురంలో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

- ప్రత్యేకాధికారుల పాలనలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానం
- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు, వీధుల్లో దర్శనమిస్తున్న చెత్తాచెదారం
- రోగాల బారిన పడుతున్న ప్రజలు

నడిగూడెం : ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారుతుంది. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో ఎటు చూసినా సరిగ్గా పూడిక తీయని మురుగుకాల్వలు, వీధుల్లో ప్రవహిస్తున్న మురుగునీరు, చెత్తా చెదారంతో వీధులు దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రంతో పాటు, బృందావనపురం, వేణుగోపాలపురం, సిరిపురం, వల్లాపురం, చాకిరాల, రామాపురం, తెల్లబెల్లి, ఎకలాస్‌ఖాన్‌పేట, ఎకలాస్‌ఖాన్‌పేట తండా, నారాయణపురం, రత్నవరం గ్రామాల్లో ఈ పరిస్థితి తీవ్రంగా ఉంది. పారిశుద్ధ్య లోపంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు ఉంటే సమస్య చెప్పేవారమని, అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో, పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం చూపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్య చర్యలు తక్షణమే పూర్తి స్థాయిలో తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


నడిగూడెం వాగులో డ్రెయినేజీ అధ్వానం..

మండల కేంద్రంలో ప్రధాన సమస్య వాగు. ఇళ్లలోని వ్యర్థాలు, చెత్తా చెదారాలు, ప్లాస్టిక్ వస్తువులు వాగులో వేస్తుండడంతో సీజనల్ వ్యాధులకు నిలయంగా మారింది. వాగు వెంట నివాసం ఉంటున్న ప్రజల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. వాగు కంపచెట్లమయంగా మారడంతో ఈగలు, దోమలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

సర్పంచ్‌ల పదవీకాలం పూర్తవ్వడంతో..

మండలంలో మొత్తం 15 గ్రామపంచాయతీలు, వాటిలో రెండు ఆవాస గ్రామాలున్నాయి. మొత్తం మండల పరిధిలోని 19,250 మంది జనాభా ఉన్నారు. గత సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తయి ఏడాది దాటింది. గతేడాది జనవరి చివరి నుంచి గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో అప్పటి నుంచి ప్రత్యేకాధికారులదే పర్యవేక్షణ బాధ్యత. అయితే ప్రత్యేక అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టకపోవడంతో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు పర్యవేక్షణ జరిపి పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి



మా గ్రామంలో డ్రెయినేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నాము. మురుగునీరు నిల్వ ఉంటుండడంతో ఈగలు, దోమల సంచారం, దుర్వాసనతో నానా అవస్థలు పడుతున్నాం. సంబంధిత అధికారులు పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలి.

– కొల్లు వెంకటేశ్వరరావు, తెల్లబెల్లి

మురుగునీరు వీధుల్లో పారుతోంది



మా గ్రామంలోని పలువీధుల్లో డ్రెయినేజీలు నిర్మించలేదు. దీంతో ఇళ్లల్లోంచి వచ్చే మురుగునీరంతా వీధుల్లో పారుతుంది. గ్రామంలో ఉన్న డ్రెయినేజీల్లో పూడికలు పూర్తిస్థాయిలో తీయడంలేదు. దీంతో మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతుంది. అదే విధంగా దోమల ప్రభావంతో సీజనల్ విషజ్వరాలు ప్రబలుతున్నాయి.

– మామిడి శ్రీను, బృందావనపురం